# తారతమ్యము

మహాత్మా ప్రసూతి వైద్యశాల ఆ రోజున రాత్రి పది గంటలకే సద్దుమణగినది. క్రొత్త కేసులు రానందున పని తీర్చుకొని- రాత్రి డ్యూటీ నర్సులు హాలులో కూర్చుని ముచ్చట లాడు కొనసాగారు.

సంసార సుఖానుభూతి ఎరుగని ఆ నర్సులు ఉదయమున ప్రసూతి కొరకు వచ్చిన వారిని తలచుకొని విడ్డూరమూ విస్మయమూ పడిపోతున్నారు. వారిలో చేరకుండా దూరముగా ఒక మూల కూర్చుని తదేక దీక్షతో పుస్తకము చదువుకుంటున్న సిస్టరుకు వాళ్ళనవ్వులూ కేరింతలూ చికాకును కలిగిస్తున్నాయి.

అంతలో హాలుకు ఎడమప్రక్కగా ఉన్న గదిలోనుండి మూలుగు ఒకటి వినబడ్డది.

హాస్యరసాస్వాదనలో కేరింతలు కొట్టుతున్న నర్సులు ఆ మూలుగును వినిపించుకొనే ధోరణిలో లేరు.

"జేసూ! నీవు చూశావా ఈ తమాషా! నాలుగవ నెంబరు గదిలో ఉన్న బాలెంతను థియేటరులోకి తీసుకొని వెళ్ళుతుంటే ఆమెతో కూడా వచ్చిన ఆయన విజిటర్సురూములో కూర్చుని ఒకటే వణకటము మొదలు పెట్టాడు. నిమిషానికొకసారి ఆమెను చూచి రమ్మంటాడు. కాలుగాలిన పిల్లి మాదిరి ఇటూ అటూ తిరుగుతూ చెమట తుడుచుకుంటూ. ఒక సిగరెట్టు పెట్టెను అయిదు నిమిషాలలో కాల్చిపారవేశాడనుకో! నీవు గనుక ఆయనను చూసి ఉన్నట్లయితే విరగబడి ఆయన ముందరే నవ్వేదానవు" అంటున్న దొక నర్సు.

ఈ మాటలతో వాళ్ళనవ్వు ఇనుమడించినది. వారిలో ఒక నర్సు లేచి ఆయన పాత్రను అభినయించ నారంభించినది. మరొక నర్సు, మొదటి నర్సు అభినయము తృప్తికరముగా లేదని, తాను అభినయిస్తూ సిగరెట్టుకు బదులుగా పుల్ల నొకదానిని నోటపెట్టుకొని - రెండు చేతులూ వెనుకకు పెట్టుకొని - ఆ హాలులో ఆ మూలనుంచి ఈ మూల వరకు అడుగులు వేయసాగినది. నడుమ నడుమ వెనుకకు తిరిగి "ఎట్లా ఉన్నదో ఒకసారి చూసి రావూ!" అని కనబడిన వారిని బ్రతిమిలాడుతూ చెమర్చిన ముఖమును తుడుచుకుంటూ నటిస్తున్న ఆ నర్సునుచూచి గవ్వలు గలగలరించినట్లు అందరూ ఒకసారి పకాలున నవ్వినారు. దానితో వారి హాస్యము మేరలుదాటి వారి విధ్యుక్తధర్మమును విస్మరింపజేసినది.

అంతలో గేటు దగ్గర సందడి వినవచ్చినది. వైద్యాలయమున కొక క్రొత్త కేసు వచ్చినది. వెంటనే నర్సులందరూ లేచి హాలులోని పెద్ద దీపమును వెలిగించి, వచ్చిన వారిని లోపలికి తీసుకొని వెళ్ళినారు.

రాత్రి మూడవ యామము దాటక మునుపు ఆమె ప్రస వించినది - ఇద్దరు అమడ బిడ్డలు పుట్టినారు. ఆమెవెంట వచ్చిన వారు ఆనందభరితులైనారు. ఆమె భర్తకు ఉద్యోగములో ఇటీ వలనే ఉన్నత పదవి వచ్చినదట - ప్రాజెక్టుకు పెద్ద ఇంజనీరై నాడట - శుభములో శుభము !

"తెల్లవార వచ్చినది. ఇప్పుడు నిద్రపోవట మెందుకు.?" అని నర్సులు తిరిగి వినోద కాలక్షేపములో పడినారు.

అంతలో టెలిఫోను గంట మ్రోగినది. పుస్తకము తిరుగ వేస్తున్న సిస్టరు రిసీవరు అందుకున్నది.

"హలో...అది ప్రసూతి వైద్యశాలేనా? నేను ఎవరితో మాట్లాడుతున్నాను?"

"ఆ ... ఇది ప్రసూతి వైద్యశాలే ... నేను ఇక్కడి సిస్టరును."

"రాత్రి పదకొండు గంటలకు పురిటికి వచ్చిన నిర్మలాదేవి ఎట్లాఉన్నది?"

"ఆమె సుఖముగా ప్రసవించినది. ఇద్దరు మగబిడ్డలు పుట్టినారు."

"ఆఁ!...ఇద్దరూ మగబిడ్డలా? మా నిర్మలకేనా?"

"అవును"

"అయితే చూడండీ...ఆమెతో నేను ఒక్కమాట మాట్లాడ వలసి ఉన్నది. టెలిఫోనులో మాట్లాడే ఏర్పాటు చేస్తారా?"

"ప్రసవించిన బాలెంత నిద్రపోతూ ఉండగా లేపటానికి వీలులేదు."

"ఆమెతో ఒక్క నిమిషమే మాట్లాడుతాను ... మీరు కొంచెము ఏర్పాటు చేయరూ?"

"నాతో చెప్పండి. ఆమె లేవగానే నేను ఆమెతో చెప్తాను"

టెలిఫోనులో పెద్ద నవ్వు వినవచ్చినది.

"ఆమెతో చెప్పవలసినది మీతో ఎట్లా చెప్పను? కైలాస నాథ్ మాట్లాడవలె ననుకుంటున్నాడని ఆమెను ఒక్కసారి లేపండి."

"క్షమించండి. మీరు కైలాసనాథులైనా-ఇప్పుడు బాలెంతను లేపటానికి వీలులేదు. రేపు ఉదయము వచ్చి చూడండి." అంటూ మరొక మాటకు అవకాశము లేకుండా సిస్టరు రిసీవరును పెట్టి వేసినది.

"అతడు కైలాసనాథుడా? ... అతని భార్యయా ... ఆ అమడబిడ్డలను కన్నది?"

సిస్టరు తలలో ఫిల్మురీళ్లు ఎన్నో తిరిగిపోయినట్లయినది. ఆమె వెనుకకు తిరిగి పరధ్యానములో వస్తూ ఉండగా - రూపా యను ఎగురవేసి తలా తోకా పరీక్షిస్తున్న నర్సులు పకాలున నవ్వినారు.

"సిస్టర్! కైలాసనాథుడి నోరు ఒక్కమాటతో అట్లా మూశావేమిటి? ఆయన ఎవరు?" అని జేసు ప్రశ్నించినది.

'ఏమో !' అన్నట్లుగా చేతిసైగచేసి అక్కడినుండి సిస్టరు వెళ్లిపోయినది. ఆమె స్వభావరీత్యా మితభాషిణి. టెలిఫోనులో సంభాషణ జరిగిన తరువాత ఆమె హృదయ మెందుకో చురుక్కు మన్నది. గాయపడిన ఆమె హృదయముపై కారము చల్లినట్లే అయినది. బలవంతముగా ఆమె పుస్తకము తెరచి పుటలను త్రిప్ప నారంభించినది. పది పుటలయినా త్రిప్పకముందే తెల్ల వారినది.

ఉదయపు పనిలో ఆమె నిమగ్నురాలై తనకు కలిగిన మానసిక కల్లోలమును మరువ ప్రయత్నించినది. పని ముగించు కొని ఆమె హాలులోకి వచ్చేసరికి ప్రక్క గదిలో నుండి చిరపరి చితమైన కంఠధ్వనీ - నవ్వులూ వినబడినవి. ఆ కంఠధ్వని అంత రంగికమైనట్లే ఆమెను ఆకర్షించినది. గతరాత్రికూడా ఫోనులో మాట్లాడిన కంఠధ్వని ఆమెను ఆకర్షించినది. కాని మనసును కలవరపరచినది !

ఆలోచనాపరంపరను ప్రక్కకు నెట్టి ఆమె, గదులలో నున్న బాలెంతలను చూచి, తిరిగి హాలులోకి వచ్చినది. అంతలో బూట్ల శబ్దము వినబడినది. 'డాక్టరుగారు ఈవేళ ఇంత ఉదయమే వచ్చారెందుకో?' అనుకొంటూ సిస్టరు తలఎత్తి చూసినది.

షుమారు నలభయి వసంతములను దాటిన ఒక స్థూల కాయము ముందుకు నడచిపోతున్నది.

ఎనిమిది సంవత్సరాలనాటికీ - ఇప్పటికీ ... కొంచెముగా రూపములో మార్పు చెందినప్పటికీ...చేతులూపుకుంటూ...

వెన్ను విరుచుకొని నడచే అతడిని వెనుక నుండే...సిస్టరు గుర్తించినది!

*　*　*　*　*

పచ్చరంగు నేవీబ్లూ చీరె కట్టుకొని మెడలోని ముత్యాల హారము సవరించుకొంటూ రేవతి దాక్షిణాత్యుల ఇళ్ళకు పసుపు కుంకుమకు బయలుదేరినది. అప్పటికి భానుడు స్వర్ణ కిరణాలను వెదజల్లుతూ పడమటి దిశన వెలుగుతున్నాడు.

ఆ దినము వైష్ణవులకు శ్రీకృష్ణజన్మాష్టమి. మైసూరు అయ్యంగార్ల గృహాలలో శ్రీకృష్ణుడు రజితమయమైన డోలికలలో పట్టుపొత్తిళ్ళలో - సర్వాంతర్యామియై - సహస్ర దీపార్చనల నడుమ జగజ్జేగీయమానముగా వెలిగిపోతున్నాడు.

రేవతి మొదట శ్రీనివాసఅయ్యంగారింటికి వెళ్ళినది. హాలులో తివాచీమీద ముత్తైదువలు కూర్చున్నారు. తూర్పుదిశగా ఒక బల్లమీద నీలి మఖమలు బట్ట పరచి దానిమీద దేవుని విగ్రహముల నమర్చినారు. వాటినడుమ వెండి ఉయ్యాలలో పైడి కృష్ణుడు ఊగుతున్నాడు. ఆ ఉయ్యెల బల్లకు మధ్యగాఉండి, వచ్చిన వారందరినీ ఆకర్షించుతున్నది. ఆ బల్లమీదనే మరొక ప్రక్క ఆ కృష్ణుని బాల్యక్రీడల దృశ్యము, సుద్ద బొమ్మలతో అమర్చబడినది. దానిలో నందగృహిణి అయిన యశోదాదేవి పద్మాసనము వేసుకొని నడుమ ఆసీనురాలై ఉన్నది. పదిమంది గొల్లపడుచులు బాలకృష్ణుని తీసుకొనివచ్చి ఆమె ముందర నిలువబెట్టి - అతడి దుడుకు చేష్టలను చేతులను చాపి వర్ణిస్తూ చాడీలు చెప్పుతున్నారు. తా మా ఊరిలో ఒక్క నిమిషమైనా

ఉండలేనట్లుగా కొంతమంది చేతులను త్రిప్పుతున్నారు. ఇంతమంది చెప్పిన చాడీలను విని, యశోదాదేవి మురిపెముతో బాలుని దగ్గరకు పిలచి అంకమున కూర్చుండ బెట్టుకుంటున్నట్లుగానూ - అందుకు గోపికలు ముక్కుమీద వేలువేసు కొంటున్నట్లుగానూ భావ ప్రకటన మవుతున్న దా బొమ్మలలో. యశోదాదేవి ముఖ ములో మాతృప్రేమ పొంగి పొరలిపోతున్నట్లుగానూ - అంత అల్లరీచేసి గోపికలను ఏడిపించిన కొంటెకృష్ణుడు, ముఖము మీద చిలిపితనములో కూడిన చిరునవ్వు చిందులాడగా-మారాము సాగించు కొన్నట్లుగాను ద్యోతకమవుతున్నదా బొమ్మలలో. రేవతి ఆ దృశ్యమును తదేక దృష్టితో చూడ నారంభించినది. చూడగా చూడగా నందగృహిణి అనిర్వచనీయమైన ఆనంద మును పొందుతున్నట్లుగా రేవతికి గోచరించినది.

అంతలో ఆయింటి యజమానురాలైన అంబుజమ్మ పిల్లల తగవులను తీర్చి రేవతి దగ్గరగా కూర్చుని కుశలప్రశ్నలు వేయగా—"ఏమండీ...ఈ బొమ్మలను కొన్నారా?" అని రేవతి అడిగినది.

"లేదండీ నాచేత నయినట్లు నేనే తయారుచేశాను. అయినా ఈ పిల్లలతో ఏ పనీ సక్రమముగా చేయలేక పోతున్నాను. ప్రతి దానికీ ముందుగా వాళ్ళే సిద్ధమవుతారు. ఇంతకూ....ఏమయినా బాగున్నాయా?" అన్నది అంబుజమ్మ.

"అబ్బ! మీకేమీ చేతకానట్లూ—పిల్లలు చెయ్యనివ్వక పోవ టమువల్ల అన్ని పనులూ ఆగిపోతున్నట్లూ చెప్తారేం? మీబొమ్మలు చిత్రకళా ప్రదర్శనములో పెట్ట తగినవిగా ఉన్నాయి. మీ అయ్యం గార్లలో శ్రీ కృష్ణుడి డోలికారోహణ బాగా చేస్తారండీ. ఈ దృశ్య

మును ఎంతసేపు చూసినా నాకు తృప్తి కలగటము లేదుసుమా! ముఖ్యముగా ఆ యశోదా దేవీ—ఆ గోపికలూ.... నా హృదయము మీద మరువరాని ముద్రలు వేస్తున్నారు. మీ చేతిలో—జీవకళలు ఉట్టిపడుతున్నట్లుగా విగ్రహములను తయారుచేయగల శిల్పకళా నైపుణ్యము ఇమిడి ఉన్నది. ఇదంతా చూస్తూ.... నేను యింటికి వెళ్ళవలెనన్నమాటే మరచినాను!" అన్నది రేవతి.

"ఉదయాస్తమానమూ పిల్లలతో వేగుతాను కనుక-నాకు అనుభవములో ఉన్న మాతృస్వరూపాన్ని భావాలకు తగినట్లుగా చిత్రించినాను...." అన్నది అంబుజమ్మ.

"మీకు ఉన్న నైపుణ్యానికి అనుభవము మెరుగులు దిద్దినది" అన్నది రేవతి.

"మాతృత్వము లేకపోతే తెలియకూడదా? ఇకముందు టెస్టుట్యూబు సంతానము బయలుదేరుతుందట. విద్యతోనూ, విజ్ఞానముతోనూ అన్ని భావాలనూ-అన్ని రసాలనూ అవగాహనము చేసుకోవాలి. ప్రతిదీ అనుభవానికి రావాలంటే ఎట్లా సాధ్యమవుతుంది?" అన్నది అంబుజమ్మ.

దానితో యిద్దరి సంభాషణ టెస్టుట్యూబు సంతానము యొక్క- మనస్తత్వము మీదికి మరలినది.

"చాలా ఆదర్శవంతముగా ఉంటుందని మావారుఅంటూ ఉంటారండీ. కాని మాతృ ప్రేమతో పొంగులువారే రక్తములో బిడ్డలు పెరుగకపోతే కొన్ని లక్షణాలు లోపిస్తాయేమో నన్న సందేహము నాకు తోస్తూఉంటుంది సుమా!" అన్నది రేవతి.

"మీరు అలా ఊహించటానికి సెంటిమెంటు కొంతవరకు కారణమేమో! అయినా యింతలో ఆ పద్ధతి మన దేశానికి వస్తుందేమో నని మీకు భయముగా నున్నదా ఏమిటి?" అంటూ లేచి నిలువబడిన రేవతికి అంబుజమ్మ తాంబూలమిచ్చి పంపివేసినది.

రేవతి తలవంచుకొని చూసిన దృశ్యమునే మాటిమాటికీ స్మృతికి తెచ్చుకుంటూ-ఆశ్చర్యపడుతూ - ఇంటిని సమీపించినది. ఆమె తల ఎత్తగానే ఆమె పెనిమిటి కైలాసనాథుడు పొరుగింటి పాపాయిని పలుకరించి ఆడించటము కనబడ్డది. పాపాయి సమక్షములో కైలాసనాథుడుకూడా ఒకచిన్నపాపాయివలె చూపట్టినాడు!

అంతవరకూ కైలాసనాథుకు పసిబిడ్డలంటేనే చీదరింపుగా వుండేది. సంతానము దాంపత్యానురాగానికి చీడపురుగు వంటిదని అందరితోనూ వాదించుతూ ఉండేవాడు. 'సంతానోత్పత్తి మానవ జీవితలక్ష్యముగా వారు ఎంచుతారు-వీరు ఎంచుతారు' అని పిల్లలు గల కుటుంబాలవైపు వేలెత్తి చూపుతూ ఉండేవాడు. అంతవరకూ అతడి ఆదర్శానికి తోడ్పడుతూ వచ్చినది ప్రకృతేగాని సైన్సు కాదు. అయినప్పటికీ అతడు తన లక్ష్యశుద్ధి వలననే జయము కలుగుతున్నదను మానసికపు బింకముతో సంచరిస్తూ వచ్చినాడు. అటువంటి తార్కికునకు పాపాయితో పనేమి వచ్చినదో? రేవతికి ఆశ్చర్యము కలిగినది.

ఈ సంఘటన జరిగిన కొద్ది దినాలకు ఒక వారము సెలవుపెట్టి మైసూరు వెళ్ళి చూసి రావలెననుకొన్న కైలాసనాథుడికి ఏమి బుద్ధి పుట్టినదో ... భార్యా సహితుడై తిరుపతి వెళ్ళినాడు. స్వామి దర్శనార్థము టికెట్టుకొని, లోపలికి వెళ్ళటానికి తగిన సమయముకొరకు ఎదురుచూస్తూ నిలువబడినారు దంపతులు.

ఆ తీర్థప్రజలను చూడగానే కైలాసనాథుడి మనసు ఆనందముతో ఉప్పొంగ సాగినది. తిరుపతి వెంకటేశ్వరులవి ఎంతటి అద్భుత చర్యలు! ఎంతదూరము నుండియైనా తన భక్తులను పిలిపించు కుంటాడట! ఇంత కాలమునుండి కైలాసనాథుడికి ఈ తలంపే లేదు. తిరుపతి దేవుడి దగ్గరనుండి సమను వచ్చినట్లే ప్రయాణము తటస్థపడినది! అందుకే కాబోలు కవిభక్తులొకరు.

ఏడు కొండలూ ఎక్కనివాడూ
వెంకన్నాయని మ్రొక్కనివాడూ
ఇల్లు గట్టినా పిల్లబుట్టినా
ఒళ్లు కుదిరినా పెళ్ళిజరిగినా
చిల్లరబెట్టి మ్రొక్కనివాడూ

మన దేశములో సామాన్యముగా కానరాడని అన్నారు. తిరుపతి వెంకన్న నిర్మొగమాటముగా పుస్తెదగ్గరనుండీ పుణికి పుచ్చుకుంటాడట! తరములు దాటినా మ్రొక్కుబడిని అనువంశికముగా జ్ఞాపకముచేస్తూ వడ్డీతో సహా వసూలు చేస్తాడట! మ్రొక్కుబడి అక్షరాలా చెల్లించేవరకూ కొండను దిగనీయడట!

నిలువబడిన ఒక గంట సేపటికి స్వామిదర్శనము కొరకు కైలాసనాథు దంపతులకు పిలుపు వచ్చినది. గర్భగుడి లోనికి గుమాస్తా యాత్రికులను మితసంఖ్యలో తీసుకొని వెళ్ళు తున్నాడు. కైలాసనాథు జంటతో మరొక జంట పిల్లలతో లోపలికి వచ్చినది. ఆ బిడ్డలకు ఆ ఉదయమే నీలాలు తీయించి నట్లున్నారు. నున్నటి తలతో-బిలిబిలి పలుకులతో తండ్రి చేతిలో

ఒకరూ - తల్లి చేతిలో ఒకరూ ఉంది - దేవుడి ముందర చేతు లను జోడించారు.

బాలద్వయాన్ని చూస్తూ నిలబడిన కైలాసనాథుడు అక్కడికి తాను వచ్చిన పనే మరచినాడు. అర్చకుడు అతడి చేతిలో తులసీ దళమును పెట్టిన తరువాత - తల వెనుకకు త్రిప్పు కొని ముందునకు అడుగు వేసినాడు.

ఇంటికి వచ్చినా కైలాసనాథుడు నోటిలోనే మాట్లాడు తున్నాడు. అతడి ప్రవర్తనలో చాలా మార్పు రేవతికి కానవచ్చి నది.

అది మొదలు ఆ దంపతుల ధోరణి తీగలు వదులయిన వీణానాదమువలె మారి, ధోరణి మూగవారినది.

కాలచక్ర మీ ధోరణిలో రెండు పర్యాయములు గ్రీష్మ మును చుట్టినది.

ఒక నా డొక దుర్ముహూర్తమున రేవతి జీవితములో అరిష్ట సూచకమైన సంఘటన ఒకటి అనుకొనకుండా జరిగి పోయినది.

అనాటి ఉదయమున ఎనిమిది గంటలైనా కైలాసనాథు నిద్రినుండి లేవకపోటమువల్ల రేవతి గదిలోకి వెళ్ళి 'నిద్రలేవరూ?, అంటూ లేపబోయినది.

రెండేళ్ళనాటి తిరుపతి దివ్యస్మృతులో...గతరాత్రి చూచి వచ్చిన చలన చిత్రమహిమో - లేక అప్పటి దుర్ముహూర్త బలమో - అతడు కలత నిద్రలోనే ఉన్నాడో - దుస్వప్న

మేదయినా కలిగినదో...కాని... "ఉదయము లేవగానే గొడ్రాలి ముఖము చూస్తే మహా పాతకమం"టూ ప్రక్కకు ముఖము త్రిప్పుతున్నాడు.

రేవతి నిశ్చేష్టు రాలయినది. గొడ్రాలి ముఖము చూడ కూడదా ! అప్పటి వరకూ అతడి ఆదర్శము అదేగా !

మరొక గంట తరువాత కైలాసనాథుడు లేచి నిద్ర మత్తును వదలించుకొని - స్నానభోజనాదులు ముగించుకొని - ఛాయామాతృపు పశ్చాత్తాపముతో - మారుమాట లేకుండా కచేరీకి వెళ్ళినాడు.

సాయంకాలము ఇంటికి పోగానే అతడికి తాళమువేయ బడిన ద్వారబంధ మెదురైనది. తన దగ్గర ఉన్న తాళపు చెవితో తాళమును తెరుస్తుండగా అతడికి చేతులు వణకినవి. అడుగులో అడుగు వేస్తూ అతడు పడకగదిని సమీపించినాడు.

ఆ గదిలో అరమరలు లేకుండా ఇంత కాలమునుండి ఒకదాని ప్రక్కన మరొకటి జంటగా ఉంటూవచ్చిన మంచాలలో ఒకటి ఏ భాగమున కా భాగము ఊడగొట్టబడి గోడకు చేర్చ బడినది.

బట్టల బీరువాలోకూడా రేవతి స్థానము ఖాళీగానే ఉన్నది:

దంపతుల ఛాయా చిత్రముల ఫ్రేములో రేవతి చిత్రము లేదు !

అతడి అర్ధాంగి తన స్థానమును ఖాళీచేసినది,

కలతబారిన మనసుతో అతడు ఇల్లంతా తిరుగాడుతూ ఉండగా రేవతి వ్రాసిన జాబు ఒకటి అతడికి కానవచ్చినది.

అది చదువుకొని అతడు విస్తుపోయినాడు. అతడి కను బొమలు ఆత్మీయముగా కలుసుకున్నవి!

"తానన్న ఆ ఒక్కమాటకూ రేవతి ఎంతపని చేసినది? తానయినా కానిమాట ఏమన్నాడనీ? అది ఉన్నమాటేగా? తానొక వేళ కానిమాటే అన్నాడనుకొన్నా ...... రేవతి ఇంతపని చేస్తుందా!"

అతడి మానసమహోదధిలో పెద్ద మథనము జరిగినది. పురాణగాథలో వలెనే మథింపబడిన మహాసముద్రమునుండి మొదట హాలాహలము బయలు వెడలినది. అతడది అమృత ముగా భావించి పానము చేసినాడు.

స్త్రీ జీవితము అరటియాకు వంటిది. అరటియాకుమీద ముల్లుపడినా - ముల్లుమీద అరటియాకు పడినా - నష్టము అరటి యాకుదే!

త్వరలోనే కైలాసనాథుడి హృదయానికీ అతడి గృహానికీ మరొకరు యజమానులైనారు.

* * *

నిర్మలాదేవికి పురిటి పదిరోజులూ సుఖముగా వెళ్ళినవి. ఆనాడు ఆమె యింటికి వెళ్ళే ప్రయత్నములో ఉన్నది.

ఉద్యోగములో చేరిన చాలా కాలానికి రెట్టింపు ప్రమోషను నిర్మలాదేవి భర్తకు దొరకినది. ఆ సంతోషములో ఇద్దరు మగ

బిడ్డలు కలిగినారని ఆ కుటుంబము అపరిమితానందములో మునకలు వేస్తున్నది; వైద్యాలయములో ఉన్న వారి కందరికీ విరివిగా బహుమానాలను యిస్తున్నారు.

బట్టతో కప్పబడిన పళ్లెమొకటి నిర్మలాదేవి సిస్టరుచేతికి అందివ్వబోయినది.

ముఖము ప్రక్కకు త్రిప్పుకొని "పదండి కారుదగ్గరికి నేనూవస్తాను" అంటూ ఒక బిడ్డనుతాను తీసుకొని నిర్మలాదేవితో కారుదగ్గరికి వెళ్ళినది.

కైలాసనాథుడు కారుదిగి తలుపు తెరచి, నిలువబడినాడు.

నిర్మాలాదేవి కారులో కూర్చుని ఆ పళ్ళెమును తీసుకో వలసినదిగా సిస్టరును తిరిగి ప్రార్థించినది.

తెచ్చుకొన్న గాంభీర్యముతో రెండవ బిడ్డను - కైలాస నాథు చేతిలో పెట్టి 'మీరు పొందిన విజయానికి నా అభినంద నాలు' అంటూ వెనుకకు మరలినది సిస్టరు.

కైలాసనాథు డామెను బాగా తేరిపార చూసి "నీవు... రేవతివా ఏమి?" అంటూ నోరు తెరచి నిలువబడి పోయినాడు!